క్లుప్తంగా

దివ్యాంగుల పింఛన్ల పరిశీలన



దివ్యాంగుల వివరాలు సేకరిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 పరిధిలో గల దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్ అధికారులు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తూర్పు, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన జరుగుతోంది. ఈ నేపథ్యంలో తూర్పు నియోజకవర్గం పరిధి 21వ వార్డు చినవాల్తేరు రెల్లివీధిలోని దివ్యాంగ పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి అధికారులు వివరాలు సేకరించారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్ పర్యవేక్షణలో యూసీడీ సిబ్బంది, కేజీహెచ్ వైద్యులు ఇతర సిబ్బంది పింఛన్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార: విద్యుత్ హెచ్‌టీ లైన్ల మరమ్మతు కారణంగా జనవరి 11వ తేదీ శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని జోన్ –1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా గురు చరణ్‌మార్గ్ లేఅవుట్, 4వ పట్టణ పోలీస్‌స్టేషన్, మోర్ సూపర్ మార్కెట్ దిగువ వీధి, ఆంధ్రప్రభ లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జోన్-3 కార్యాలయంలో 31 సీసీ కెమెరాల ఏర్పాటు

సీతమ్మధార : నగరంలోని ఆశీలమెట్ట అశోకనగర్‌లో గల జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను జోనల్ కమిషనర్ శివప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. కార్యాలయంలోని జీ+2 అంతస్తులలో పలు విభాగాలు ఉన్నాయి. రెవెన్యూ విభాగం, ప్రజారోగ్యశాఖ, ఓటర్ల నమోదు విభాగం, జోనల్ కమిషనర్, మలేరియా విభాగం, సౌకర్యం, యూసీడీ విభాగం, వీధిలైట్ల విభాగం, పబ్లిక్ వర్క్స్ తదితర విభాగాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 31 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని జోనల్ కమిషనర్ శివప్రసాద్ శుక్రవారం తెలిపారు.

గోపూజకు ఏర్పాట్లు



గోపూజ బ్యానర్ ఆవిష్కరిస్తున్న ఈవో ప్రసాద్, అర్చకుడు, శేషాచార్యులు

మురళీనగర్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఈనెల 15న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గోపూజ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో బి.ప్రసాద్ చెప్పారు. హిందూ ధర్మ ప్రచార సమితి ప్రతినిధి ఎంకేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని గోపూజ బ్యానర్‌ను ఈవో ప్రసాద్, ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఆలస్యంగా బయలుదేరిన రైళ్లు

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా విశాఖపట్నం చేరుకోవడంతో.. శుక్రవారం ఇక్కడి నుంచి పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయి. శుక్రవారం సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–దుర్గ్ ఎక్స్‌ప్రెస్ (18530) సుమారు 1.15 గంటలు ఆలస్యంగా సాయంత్రం 6:10 గంటలకు బయలుదేరింది. అలాగే శుక్రవారం రాత్రి 11.20 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా శనివారం తెల్లవారుజామున 1.20 గంటలకు బయలుదేరింది.

పట్నమొచ్చిన పల్లె



హరిదాసుకు బియ్యం వేస్తున్న బాలిక

‘సీతమ్మకు చేయిస్తి.. చింతాకు పతకమ్ము.. రామచంద్రా’ అంటూ హరిదాసుల కీర్తనలు వినసొంపుగా వినిపిస్తున్నాయి. భద్రాచలం రామదాసుకు వారసులు హరిదాసులు. చేతిలో చిడతలు, కాలికి గజ్జెలు, పట్టుధోవతి పంచెకట్టు, పట్టు కండువా నడుముకి చుట్టి, మెడలో పూలహారం, నుదుటికి తిలకంతో ధనుర్మాసం నెలరోజులు హరినామ సంకీర్తనతో భక్తుల నుంచి దానధర్మాలు స్వీకరిస్తూ పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణానికి దోహదపడుతుంటారు.

- కాలనీల్లో హరిదాసుల సందడి
- ప్రజల నుంచి దానాల స్వీకరణ
- హరినామ సంకీర్తనతో ఆధ్యాత్మిక సవ్వడి

మద్రిపాలెం: సంక్రాంతి వస్తుందంటే చాలు హరిదాసులు తెల్లవారు జామున నెత్తిన అక్షయపాత్ర పెట్టుకుని ఊరువాడ తిరుగుతూ రామాయణ పారాయణం చేస్తూ కనిపిస్తుంటారు. ఈ క్రమంలో జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం, గ్రీన్‌గార్డెన్స్, హుస్సేన్‌నగర్, శివనగర్, జాకీర్ హుస్సేన్‌నగర్‌లో హరిదాసులు ప్రతి ముంగిళ్లలోనూ కీర్తనలు ఆలపిస్తూ కనిపిస్తున్నారు.

ఈ నేపథ్యంలో కులమతాలకు అతీతంగా చిన్నాపెద్దా తేడా లేకుండా ఇంట్లో ఎవరుంటే వాళ్లు హరిదాసుకు నమస్కరించి శక్తి మేర బియ్యం, నగదు సమర్పించి భక్తిప్రపత్తులు చాటుకుంటున్నారు. సంక్రాంతి పండగ సమీపిస్తున్న తరుణంలో హరిదాసులు తమ ముంగిళ్లకు రావడం తమకు ఆనందంగా ఉందని, మంచి జరుగుతందని ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం పట్టణీకరణ పెరిగిపోవటంతో హరిదాసులు కనుమరుగువుతున్నారు. వారు ఎదురు పడినా సరే గుర్తించేవారు కరవయ్యారు. వీరు ఏ ఇంటి ముందు నిలబడి అర్థించరు. హరిదాసుకు తాము సమర్పించుకోవాల్సినది ఏదైనా ఉంటే వారికి ఎదురుగా మనమే నిల్చుంటే హరిదాసు కూర్చుంటారు. అప్పుడు వారి అక్షయపాత్రలో మనం వేసేది తీసుకుని రామార్పణం అంటు వెళ్లిపోతారు. కార్తీకం, మార్గశిరం, పుష్యమాసాల్లో మాత్రమే వీరు కనిపిస్తుంటారు. వీరి పిల్లలు మాత్రం ఈ వృత్తిని స్వీకరించేందుకు ఇష్టపడటం లేదని హరిదాసులు ఆందోళన చెందుతున్నారు. తరతరాలుగా వస్తున్న వారసత్వంపై మమకారం ఉన్న కొందరు హరిదాసులు మాత్రమే ప్రస్తుతం సందడి చేస్తున్నారు.

అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తాం..

ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉపవాసంతో వీధివీధి తిరిగి ప్రజల నుంచి దానం స్వీకరిస్తాం. సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత అక్షయపాత్ర దించి, శుచి అయి రామభద్రుడి పూజ అనంతరం విశ్రాంతి తీసుకోవటం దినచర్య. హరిదాసుగా నగరంలో పలు ప్రాంతాల్లో తిరుగుతూ రామాయణం, అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తుంటాం. శ్రీరామ నవమికి భద్రాచలం కల్యాణానికి అంతా కలిసి వెళ్లి వచ్చేటపుడు కల్యాణపు అక్షతలు తీసుకొచ్చి భక్తులకు అందజేస్తుంటాం. ఈ సమయంలో ఉపవాసంతోనే ఉంటాం.

– కోట్ల భీమరాజు, హరిదాసు

మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఇందిరాగాంధీకాలనీ వాసులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ శుక్రవారం 42వ వార్డు పరిధి ఇందిరాగాంధీ కాలనీలో పర్యటించారు. ఈ ప్రాంతంలో గల డ్రైనేజీ, శానిటేషన్, స్ట్రీట్‌లైట్స్ వంటి పరిస్థితులను పరిశీలించారు. ఇదే ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, తమకు పట్టాలు ఇప్పించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కమిషనర్‌కు విన్నవించారు. కాలనీలో నివసించే వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో స్థానిక కార్పొరేటర్ ఆళ్ల లీలావతి మురికివాడల నివాసుల ససంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు ఎం. లక్ష్మి, ఏసీపీ శాస్త్రి, డీసీఆర్ ఎస్. శ్రీనివాస్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి ఈఎన్‌వీ నరేష్ కుమార్, జోన్–5, జోనల్ కమిషనర్ బి. రాము, సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింగళికి ఘన నివాళి



మాట్లాడుతున్న సాహితీవేత్త డాక్టర్ సూర్యారావు

సీతంపేట: విశాఖ సాహితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రముఖ కవి, విమర్శకుడు, ఏయూ తెలుగు శాఖ తొలి ఆచార్యులు డాక్టర్ పింగళి లక్ష్మీకాంతం 131వ జయంతి సభ జరిగింది. విశాఖ సాహితి ఉపాధ్యక్షులు కందాళ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ పింగళి జీవిత విశేషాలను వివరించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ పింగళి, కాటూరితో జంటగా రచించిన సౌందర్య నందనం, మధుర పండిత రాజం కావ్యాలలోని విశేషాలను సోదాహరణంగా వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ లక్ష్మీకాంతంను గొప్ప విమర్శకుడిగా నిరూపిస్తూ, వారి సాహిత్య చరిత్ర, సాహిత్య శిల్ప సమీక్ష, గ్రంథాల వైశిష్ట్యాన్ని వివరించారు. పింగళి మనమడు శ్రీధర్ మాట్లాడుతూ పింగళి అంతటి మహనీయునికి వారసుడిగా పుట్టడం గర్వకారణమన్నారు. ఈ సమావేశంలో సాహితీవేత్తలు ద్విభాష్యం రాజేశ్వరరావు, జె.పి.శర్మ, విజయకుమార్, ఘండికోట విశ్వనాథం, శంకరనీలు తదితరులు పాల్గొన్నారు,

‘మీ చేతగానితనాన్ని ఇతరులపై నెట్టేస్తారా?’

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో ఏం జరిగినా.. గత ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అనడం వారి చేతగానితనానికి నిదర్శనమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విమర్శించారు. తిరుపతిలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని, ఇది కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ ప్రమాదంలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. 2,500 మందికే కనీస ఏర్పాట్లు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసి.. భక్తుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపిందని మండిపడ్డారు. వైకుంఠ ఏకాదశికి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారన్న విషయం ప్రభుత్వానికి తెలిసినా.. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందో సీఎం, డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



వాగ్దేవి పాఠశాలలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: పల్లెల్లో సంక్రాంతి పండగ ఎలా జరుపుకుంటారో కళ్లకు కట్టినట్టు చూపారు వాగ్దేవి స్కూల్ విద్యార్థులు. అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్ సమీపంలో గల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు కనుల పండువగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు, గాలిపటాలు, హరిదాసు, గంగిరెద్దులు, డూడూ బసవన్నలతో పండగ వాతావరణం ఏర్పడింది. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ ముఖ్య అతిథిగా సంబరాలను ప్రారంభించి సంక్రాంతి పండగ విశిష్టత వివరించారు. స్కూల్ డైరెక్టర్ ఎం.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు పండగల గొప్పదనాన్ని ప్రతి విద్యార్థి తప్పక తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్. శైలజ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ మేరకు చిన్నారులు సంప్రదాయ దుస్తులు, ఆటపాటలతో అలరించారు. గొబ్బెమ్మలు, భోగి మంటల చుట్టూ తిరుగుతూ వేడుకలు జరుపుకున్నారు. ఈ సంబరాల్లో ఐసీడీఎస్ సీడీపీవో రమణకుమారి, సహాయక సీడీపీవో శ్రీలత, అంగన్‌వాడీ టీచర్ మౌలా బీబీ, పెద్ద ఎత్తున చిన్నారులు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు

అనంతరం కేంద్రంలో చిన్నారులకు గాలిపటాలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముందుగా నూతన కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం జరిగింది. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు అత్యధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల అధ్యక్షురాలు ప్రభావతి ఈ పోటీలను ప్రారంభించారు. పేడాడ రమణికుమారి న్యాయనిర్ణేతగా వ్యవహరించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందించారు. లీడర్ పత్రిక వ్యవస్థాకులు రమణమూర్తి బహుమతులు సమకూర్చారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.





మహిళలు వేసిన ముగ్గులు

నేత్రపర్వం ఉత్తర ద్వార దర్శనం



శ్రీలలితాపీఠంలో చందన అలంకరణలో దర్శనమిచ్చిన కల్యాణ వేంకటేశ్వర స్వామి



శ్రీలలితాపీఠంలో వైకుంఠవాసుని దర్శనం కోసం భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో వైభవ వేంకటేశ్వరుడు

సీతంపేట: ముక్కోటి ఏకాదశి సందర్భంగా గోవింద నామస్మరణతో వైష్ణవాలయాలు మార్మోగాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రధాన ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

శ్రీలలితాపీఠంలో..

లలితాపీఠంలో ఉత్తర ద్వార దర్శనం నేత్రపర్వంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని భక్తులు తరించారు. గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ముందుగా పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి వేంకటేశ్వరునికి పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ధనుర్మాస వ్రత నిత్యకైంకర్య సేవలతో పాటు ఊంజల్ సేవ, చందన అలంకరణతో స్వామి వారి దర్శనం కల్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అలంకరణలో వేంటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మండపంలో పద్మావతి, అలివేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కూర్మనాథాచార్యులు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, సహస్రనామార్చన, నక్షత్ర హారతులు ఇచ్చారు.

సర్వాంగ వజ్రకవచధారిగా వైభవుడు..

మురళీనగర్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా గర్భాలయంలోని వైభవ వేంకటేశ్వరస్వామి సర్వాంగ వజ్రకవచంతో దర్శనమిచ్చారు. పూజల అనంతరం 200 కేజీల వివిధ జాతుల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. వజ్రకవచధారుడి అవతారంలో వైభవుడు ఆదివారం వరకు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, వెలమ కార్పొరేష్ చైర్మన్ పీవీజీ కుమార్, బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక, జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, కంకటాల అధినేత కంకటాల మల్లిక్, సీఈ శివప్రసాద్, జెడ్పీ బి.రాము, డిప్యూటీ ఫ్లోర్‌లీడరు అల్లు శంకరరావు, పలువురు కార్పొరేటర్లు స్వామిని దర్శించుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం వీరిని ఆలయ ఈవో బందారు ప్రసాద్ సత్కరించారు. మహిళలు ప్రదర్శించిన కోలాటాలు, అన్నమాచార్య కీర్తనలు అలరించాయి.



శ్రీనివాసనగర్‌లో శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఘనంగా ముక్కోటి ఏకాదశి

కంచరపాలెం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం కంచరపాలెంలోని తిక్కవానిపాలెంలో గల కలియుగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శన పూజలకు భక్తజనం పోటెత్తారు. ఆలయ అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారి జాము 4 గంటలకు గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు దంపతులు కలశ ప్రతిష్ఠ, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. గ్రామ సంఘం సభ్యులు రాజు, నాగరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పనులను పర్యవేక్షించారు.

సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు..

మురళీనగర్: స్థానిక రామాలయంలో నిర్వహించిన ఉత్తర ద్వారం దర్శనంలో సీతారామలక్ష్మణులకు తులసీదళాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యదర్శి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. పట్టాభిరెడ్డితోట దాసాంజనేయస్వామి ఆలయంలో ఆరవిల్లి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు చేశారు. దాసాంజనేయస్వామి బంగారు కవచధారుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యానగర్–2లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో స్వామిని వైకుంఠ నారాయణోపాస మారుతిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.



కళాకారులతో కలిసి వైభవుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



ఉత్తర ద్వారంలో సీతారామచంద్రులను దర్శించుకుంటున్న భక్తులు



వెంకన్న ఆలయంలో ఉత్తరద్వార దర్శనంలో భక్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 11.94 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం హుండీలు లెక్కించారు. 37 రోజులకుగాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.11,94,809 వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు. దేవదాయ సహాయ కమిషనర్ కార్యాలయానికి చెందిన సీనియర్ సహాయకులు డి.జె.పి. ప్రభ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కంచరపాలెం పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

పాపాహోం పిల్లలకు శ్రీదేవి విజన్ వితరణ



పాపాహోమ్ పిల్లలకు పండ్లు, దుస్తులు అందజేస్తున్న ఎస్‌డీవీ ప్రతినిధులు

సీతమ్మధార: శ్రీదేవి విజన్ టీవీ ఛానెల్ వ్యవస్థాపకులు ఇసుకపల్లి రామకృష్ణంరాజు జయంతి శుక్రవారం నిరాడంబరంగా జరిగింది. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా సంస్థను ముందుకు తీసుకెళ్తానని సంస్థ ఎం.డి.ఇసుకపల్లి గణేష్ కుమార్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా సీతమ్మధారలో గల పాపాహోంలో ఎస్.డి.వి.న్యూస్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ పెన్మెత్స సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడి బాలికలకు వస్త్రాలు, పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. తమకు నూతన వస్త్రాలు ఇవ్వడం ఆనందంగా ఉందని బాలికలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి విజన్ ఛానల్ సిబ్బంది పాల్గొన్నారు.